# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-03-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఉపాధిహామీ కూలీలకు వేతనాల పెంపు అంశం.. కేంద్రం పరిధిలో ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు.**
2. **విశ్వవిద్యాలయాల్లో పరిపాలన కోసం యూనిఫైడ్ చట్టాన్ని త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
3. **రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నుంచి పదో తరగతి సార్వత్రిక పరీక్షలు ప్రారంభమయ్యాయి**
4. **ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తు దాఖలు గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ తెలిపింది.**

==========================

రాష్ట్ర శాసనసభలో ఈరోజు ఉపాధి హామీ పథకం గురించి జరిగిన చర్చలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పనుల్లో అవినీతిని గుర్తించామని తెలిపారు. మొత్తం 250 కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు అధికారులు.. తమ దృష్టికి తెచ్చారన్న పవన్ కల్యాణ్ .. దానిపై విచారణ జరుగుతోందన్నారు. ఉపాధిహామీ కూలీలకు వేతనాల పెంపు అంశం.. కేంద్రం పరిధిలో ఉంటుందని తెలియజేస్తూ..

.....వాయిస్.... 34 సెకన్లు....

--------------------------

విశ్వవిద్యాలయాల్లో పరిపాలన కోసం యూనిఫైడ్ చట్టాన్ని త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ ఈరోజు శాసనమండలిలో తెలిపారు. మెరుగైన చట్టాన్ని రూపొందించేందుకు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఐఐటీ మద్రాస్, టోక్యో యూనివర్సిటీ, టిసిఎస్‌తో కలసి అమరావతిలో డీప్ టెక్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి లోకేష్ వివరిస్తూ..

..వాయిస్.. 31 సెకన్లు

--------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నుంచి పదో తరగతి సార్వత్రిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 1 వరకు కొనసాగనున్న ఈ పరీక్షలకు 3 వేల 450 కేంద్రాలలో 6 లక్షల 49 వేల 275 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. సుమారు 6.50లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈసారి రెగ్యులర్ విద్యార్థులతోపాటే సార్వత్రిక విద్యాపీఠం అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రశ్నపత్రం చదువుకునేందుకు అదనంగా 15 నిమిషాల సమయాన్ని కేటాయించారు. హాల్ టికెట్ చూపించిన విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వరకు ఆర్.టి.సి. బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తోందని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అవసరమైన పరీక్షా కేంద్రాలలో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏదైనా అవసరం ఉన్న వారు 0866 – 297 4540 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు.

----------------------------

రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం 8 లక్షల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు తీసుకువచ్చిందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కాకినాడలో నిన్న నిర్వహించిన జాతీయ పారిశ్రామిక భద్రతా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటివరకు తీసుకొచ్చిన పెట్టుబడులతో రానున్న రెండేళ్లలో 7 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. అమరావతిలో 150 పడకలతో కార్మిక ఆసుపత్రి నిర్మాణానికి ఆమోదం లభించిందని తెలిపారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు 30 వైద్య చికిత్సా కేంద్రాలను నెలకొల్పుతామని పేర్కొన్నారు.

----------------------------

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ దరఖాస్తు గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ తెలిపింది. ఆసక్తి గల అభ్యర్థులు pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కీమ్ ద్వారా భారతదేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. పదో తరగతి అర్హత ఉన్నవారు మొదలుకుని గ్రాడ్యుయేషన్ వరకు అందరూ ఈ పోర్టల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

----------------------------

పార్టీలకు అతీతంగా కలసికట్టుగా రాష్ట్రాభివృద్ధికి అందరూ కృషి చేయాలని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఈరోజు ఉదయం ఆయన దర్శించుకున్నారు. ఆనంతరం ఆలయం వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు. 14 వేల పంచాయితీలలో పార్టీలకు అతీతంగా ఉగాది పండగ జరుపుకోవాలని కోరుతున్నానన్నారు.

----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ నెల 30వ తేది ఆదివారం ప్రసారం అవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

----------------------------

సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో వేలిముద్రలు పడక లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను నివారించేసదుకు ప్రస్తుతం వినియోగిస్తున్న స్కానర్ల స్థానంలో ఎల్-1 స్కానర్లను ఉపయోగించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.34 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి కొత్త పరికరాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

అనకాపల్లి జిల్లా విజయరామరాజుపేటలో గతరాత్రి భారీ వాహనం రైల్వే వంతెన గిర్డర్‌ను ఢీ కొనడంతో అండర్ బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతింది. ఈ ఘటనతో విశాఖ- విజయవాడ మార్గంలో పలు రైళ్ల రాకపోకలకు కాసేపు అంతరాయం ఏర్పడింది. దీంతో కశింకోట వద్ద గోదావరి, విశాఖ ఎక్స్ ప్రెస్‌లను అధికారులు నిలిపేశారు. కొంత సమయం తర్వాత మరో ట్రాక్ పైకి నుంచి రాకపోకలను పునరుద్ధరించగా దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌కు సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు.

---------------------------

శ్రీశైలం దేవస్థానం నకిలీ వెబ్‌సైట్‌లను నమ్మి భక్తులు మోసపోకూడదని శ్రీశైలం ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. శ్రీశైలంలో దేవస్థానం వసతిని ముందస్తుగా రిజర్వు చేసుకునేందుకు, ఆర్జితసేవలను, దర్శనం టికెట్లను ముందస్తుగా పొందేందుకు దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ www.srisaila devasthanam.org లేదా దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్ www.aptemples.ap.gov.in లను మాత్రమే వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరములకు దేవస్థానం సమాచార కేంద్రాన్ని సంప్రదించాలని శ్రీనివాసరావు సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రతి పేదవానికి సొంత ఇల్లు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయచంద్ర అన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో 2 వేల 246 మంది అర్హులను గుర్తించి వారికి పక్కా గృహాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పార్వతీపురం నియోజవర్గంలోని బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం అర్బన్ పరిధిలోని పీఎంఏవై 1.0 లో ఇళ్ళు మంజూరై, వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న బీసీ,ఎస్సీ లబ్ధిదారులకు 50 వేల రూపాయలు, ఎస్టీ లబ్ధిదారులకు 75 వేల రూపాయలు, పీవీటీజీ లబ్ధిదారులకు లక్ష రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అదనంగా సహాయం అందిస్తుందని తెలిపారు.

=====================